# సరళారావ్

గడచిన శతాబ్ధంలో ఈదేశంలో జన్మించిన మహాపురుషులు అనేకులు బానిసత్వంలో, అనైకమత్యంలో దారిద్ర్యంతో సతమతమవుతున్న కాలంలోనే ఈ మహానుభావులందరూ ఉదయించి దేశజీవితంలోని వివిధ రంగాలను ఉత్తేజితం చేశారు. అటువంటివారిలో వివేకానందుడొకడు.

"ఆకలితో వున్నవారికి దేవుడిగురించి చెప్పడంకన్న మహాపాపం మరొక్కటిలేదు—" అని చెప్పిన ఆ మనిషి శతజయంతి సందర్భంగా దేశపాదపీఠమయిన కన్యాకుమారివద్ద గతసంవత్సరం — స్మారక మందిరానికి ప్రారంభోత్సవం చేశారు. ఆ సందర్భంగా "అక్షయఆలోక్"అన్న సంగీతనృత్య రూపకాన్ని ప్రదర్శించారు, కన్యాకుమారిలో అయిదుసార్లు ప్రదర్శించిన ఈఅద్భుతమైన రూపకాన్ని ఇటీవల ఢిల్లీలో వరుసగా అయిదు రోజులు ప్రదర్శించారు.

కేంద్ర సమాచార శాఖవారి సంగీతనృత్య విభాగంవారు ప్రదర్శించిన ఈ రూపకంలో — వివేకానందుడి జీవితంలో ముఖ్యఘట్టాలను - బెంగాలీ, సంస్కృతం, హిందీ, పాలి, తమిళం మున్నగు భాషలపాటల ఆధారంగా వివిధనృత్య రీతులలో - చక్కగా ప్రదర్శించారు. ఈ రూపకంలో రంగస్థలంమీది దృశ్యాలు మార్చడానికి వెనుక తెరమీద "సైక్లోరమా"పద్ధతి నవలంభించారు. ఇది చూడడానికి అందంగా వుండటమేగాక కాలం ఎంతో కలిసివస్తుంది.

వివేకానందుడిలో ఎదిగిన జిజ్ఞాస, రామకృష్ణుడి ఆశీఃబలంతో వెలుగవగా. ఆ వెలుగును ఆ వివేకాన్ని ఆనందంగా అందరికీ పంచిన కథను కనుల

పండువగా కూర్చినవారు దర్శకులు పంచానన పాఠక్. నృత్యప్రదర్శకులు అప్పుణ్ణి కర్త. 18 30 సంవత్సరాల యువతీ యువకులు. దేశం లోని అన్నిప్రాంతాలవారూ - అన్నిభాషల పాటలు పాడుతూ ఆనందంగా నృత్యం చేస్తుంటే చూడ ముచ్చటగావుంది. ఈ చక్కటి యత్నంలో పాటలు పాడినవారిలో డి. వెంకట్రావు. లోకనాథశర్మ, రత్నారావులు -- నర్తకీనర్తకులలో రాజారెడ్డి - రాధారెడ్డి - తెలుగువారు.

ఈరూపకాన్ని గురించిరాస్తూ ఇంచుమించు అన్ని ఢిల్లీ దినపత్రికలూ ఈరూపకంలో అన్నిటికన్న మిన్నగా వున్నది కమ్మని సంగీతం -- అని. ప్రశంసించారు. ఈ రూపకానికి సంగీత సారథ్యం వహించినది తెలుగు ఆడపడుచు శ్రీమతి పక్కలంక సరళారావు.

ఈ సంగీత నృత్యవిభాగంలో 'మ్యూజిక్ కంపోజర్'గా వున్న శ్రీమతి సరళ అతి శ్రావ్యంగా పాడగల్గడమే కాదు, అతి సమర్థవంతంగా సంగీతదర్శకత్వం వహించగలదు, కర్నాటక హిందూస్తానీ శాస్త్రీయ సంగీతాలలో శిక్షణపొందిన సరళగారికి లలితసంగీతం ఆదినుండీ ఇష్టం.

"శాస్త్రీయ సంగీతం కానిదంతా లలితసంగీతంగా చలామణీ అవు తూంది. ఇది సరికాదు లలితసంగీతానికొక వ్యక్తిత్వాన్ని, నిండుదనాన్ని విశిష్టస్థానాన్నికల్పించాలి. ''రవీంద్రసంగీత్'' అని ఒక బాణీ ఏర్పడింది. అట్లాగే లలితసంగీతానికి ఒక నిర్దిష్ట స్వరూపం ఏర్పడాలి. శాస్త్రీయ సంగీతంలో పాటకన్నా గాయకుడి వ్యక్తిత్వానికి ప్రాధాన్యం వుంటుంది. ఫలానా త్యాగరాజకృతి వీరిట్లా పాడగా, వారు అట్లాపాడారు అని చెప్పు కుంటాము.కాని లలితసంగీతంలో అట్లాకాదు. పాట ముందుకు రావాలి. పాడేవారు వెనక వుండాలి. మీరా భజనగీతం పాడితే మీరా కనపడాలి. మీరాభక్తి తీవ్రత వినపడాలి" అంటారు సరళ.

పాతికేళ్ళ క్రింద "బా ల రా జు" సినిమాలో "తీయని వెన్నెల రేయి"— "కీ లు గు ర్రం' లో "కాదుసుమా కలకాదుసుమా" పాటలు పాడినవారు సరళేనని చాలమందికి తెలియకపోవచ్చును. 50-60 తెలుగు, తమిళం, మళయాళం, హిందీ చలనచిత్రాలలో పాటలు పాడిన ఈమె కొంతకాలం జెమినీ స్టూడియో సంగీతవిభాగంలో పనిచేశారు. తమిళంలో కథలు రాసిన సరళకు ఉర్దూ, బెంగాలీ భాషలు వచ్చు, ఆమె "ఆంధ్ర జ్యోతి" దినపత్రిక ఆదివారం అనుబంధంలో "నారీలోకం" శీర్షికనాక ఏడాదిపాటు నిర్వహించారు.

ఫిలిం డివిజన్‌వారి ఒక డాక్యుమెంటరీ చిత్రానికి, పూనాలోని ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌వారి హ్రస్వచిత్రాలు కొన్నింటికి సంగీత దర్శకత్వం వహించిన శ్రీమతి సరళ ప్రస్తుతం "స్వరలహరి" అన్న సంగీత నృత్యబృందాన్ని స్థాపించారు. ఈబృందంవారు ఏభారతీయ భాషలోనయినా కార్యక్రమాలను నిర్వహించగల్గడం చెప్పుకోదగిన విశేషం. గతమాసం ఇక్కడ 'తెలుగుసాహితి' వారేర్పాటు చేసిన "కృష్ణశాస్త్రితో ఒక సాయంకాలం" కార్యక్రమంలో సంగీత, నృత్యభాగాన్ని నిర్వహించి అందరి మన్నలకు పాత్రులయినది ఈ "స్వరలహరి"బృందంవారె! అనతికాలంలోనే దేశమంతా, వీరు పంచిపెట్టే ఆనందాన్ని ఆస్వాదిస్తుందనీ ఆ భాగ్యం ఇతర దేశాలకూ విస్తరిస్తుందనీ, ఆ మంచిపని నొక తెలుగుపడుచు చేసిందని తెలుగువారంతా గర్వించే రోజు తలుపులు తడుతున్నదని ఆశిద్దాము.

[11 జూన్ 71]